క్లుప్తంగా

సంపు పనులకు శంకుస్థాపన



కోనేరుసెంటర్: మంగినపూడి, కొత్తపూడి గ్రామాల్లో సంపు నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజల కోరిక మేరకు ఒక్కో గ్రామంలో రూ. 10 లక్షలతో సంపు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గ్రామాల్లో వసతుల కల్పనకు ఎమ్మెల్యే పేర్ని నాని తన వంతు కృషి చేస్తున్నారన్నారు. మంగినపూడి, తపసిపూడి, పొట్లపాలెం సర్పంచులు కూనపురెడ్డి ప్రమీలారాణి, చందన మస్తాన్‌రావు, గాజుల నాగరాజు, చిలకలపూడి సొసైటీ అధ్యక్షుడు నాగబాబు, వాకాలమ్మ దేవాలయం అధ్యక్షుడు రామకృష్ణ, మంగినపూడి మాజీ సర్పంచ్ కూనపురెడ్డి వీరాస్వామి పాల్గొన్నారు.

సాహితీవేత్త రామారావుకు నివాళి



మచిలీపట్నంటౌన్: సాహితీ తపస్వి, ఆంధ్ర సారస్వత సమితి అధ్యక్షుడు కొట్టి రామారావు సాహిత్య రంగానికి అందించిన సేవలు నిరుపమానమని పలువురు వక్తలు అన్నారు. కొట్టి రామారావు సంతాపసభ ఆదివారం స్థానిక వివేకానంద మందిరంలో నిర్వహించారు. మచిలీపట్నం సాహిత్య, సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ సాహితీరంగం ఆయనను కోల్పోవడం బాధాకరమన్నారు. సాహిత్యరంగానికి కొట్టి రామారావు అందించిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వైద్యుడు ధన్వంతరీ ఆచార్య, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, భావతరంగిణి సంపాదకుడు భవిష్య, బందరు చరిత్ర రచయిత మొహమ్మద్ సిలార్, విశ్రాంత అధ్యాపకుడు సవరం వెంకటేశ్వరరావు, ఎల్. బాలాజీ, సాహితీవేత్తలు చింతలపాటి మురళీకృష్ణ, కొల్లూరి రామ్మోహనరావు, గుడిపూడి రాధికారాణి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

గూడూరు: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై బోల్తాపడింది. సేకరించిన వివరాల ప్రకారం.. అమలాపురం నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై చిట్టిగూడూరు సమీపంలో ఆదివారం ఉదయం అదుపు తప్పి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణించే ముగ్గురు చిన్నారులతో సహా మరో ముగ్గురిని స్థానికులు కాపాడారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

200 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూల్ ఆవరణలో జరిగిన శిబిరంలో 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 135 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని సోమవారం ఆస్పత్రికి తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేయిస్తామని సుదర్శి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. డాక్టర్ రియా, డాక్టర్ ఆకాంక్ష వైద్య సేవలు అందించారు. కంటి ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి ఎం.రవికుమార్, మండవ వెంకటేశ్వరరావు, తలశిల లీలామనోహర్, జమీలా మస్తాన్, కనిగంటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

మణిపూర్ బాధితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు



మచిలీపట్నంటౌన్: మణిపూర్‌లో జరిగిన హింసాకాండ, అల్లర్లకు గురైన బాధితులకు మనోధైర్యం కలగాలని కోరుతూ స్థానిక పరాసుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితి నెలకొని ప్రజలంతా శాంతియుతంగా జీవించేలా చూడాలని కోరుకున్నారు. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూరాలని ప్రార్థించారు. ప్రత్యేక ప్రార్థనల్లో చర్చి ఫాదర్ స్వామినాథన్, క్రైస్తవులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో ఇంటి దగ్గరే దాక్టర్‌తో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మోపిదేవి మండలం కోసూరువారిపాలెంకు చెందిన వృద్ధురాలి పేరు గరికపాటి బసవపూర్ణమ్మ. వయస్సు 84 సంవత్సరాలు. గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మోపిదేవి మండలంలోని రావివారిపాలెం పీహెచ్‌సీకి, లేదంటే చల్లపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలలకు కుటుంబ సభ్యులు ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లేవారు. బయటకు వెళ్లాలంటే తప్పనిసరిగా ఒక వ్యక్తి, ప్రత్యేక వాహనం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌ల ద్వారా ఇప్పుడు నెలకు రెండు సార్లు వైద్యులే ఇంటికి వచ్చి బసవపూర్ణమ్మకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. దీంతో ఈమెకు గతంలో పడిన ఇబ్బందులన్నీ తొలగిపోవడంతో ఆనందం వ్యక్తంచేస్తోంది.



నాపేరు పరింకాయల భాగ్యలక్ష్మి. పెడన మండలం బలిపర్రు గ్రామంలో నివాసం. నా భర్త వెంకటేశ్వరరావు (70). కొడుకు యుక్తవయస్సులో చనిపోయాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు అయ్యాయి. మా ఆయన మూడేళ్ల కిందట పక్షవాతానికి గురయ్యాడు. మాట, కాళ్లు, చేతులు పడిపోయాయి. విజయవాడలో చూపించి మందులు వాడుతున్నాం. అక్కడకు తీసుకువెళ్లాలంటే ఖర్చుతో కూడుకుంది. మాకు దగ్గరలోనే దాక్టర్లు చూస్తున్నారని తెలిసి వెళ్లి పరిస్థితిని వివరించా. వారు ఇంటికి వచ్చి చూస్తామంటే నమ్మబుద్ధి కాలేదు. వీళ్లు ఇంటికి వస్తే డబ్బులవుతాయని భయపడ్డా. మరుసటి రోజు ఇంటికి వచ్చి నా భర్తను పరీక్షించారు. రక్తం తీసుకుని పరీక్షలు చేశారు. నెలకు రెండుసార్లు పెద్ద దాక్టర్లు వస్తున్నారు...చూస్తున్నారు...మందులిస్తున్నారు. ఖర్చులు బాగా తగ్గాయి. మార్పు వస్తుందని ఆశతో ఉన్నా.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షల కోసం గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. బయటకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకోవడంతోపాటు మరొకరు తోడుగా ఉండాలి. విలేజ్ క్లినిక్‌ల ద్వారా డాక్టర్లు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది. దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఇలాంటి మంచి ఆలోచనలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– అనూరాధ, కోసూరువారిపాలెం

మంచి మనస్సున్న సీఎం జగన్



మాది నాగాయలంక మండలం సుముద్ర తీర ప్రాంతంలోని నాచుగుంట. ఎదురుమొండి దీవిలోని మా గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. మండల కేంద్రానికి వెళ్లాలంటే ఫంటుపై ప్రయాణం చేయాలి. జగన్ ప్రభుత్వంలో ఇళ్లకే డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. మంచి మనస్సున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి మా కోసమే ఇలాంటి మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

– నాయుడు వెంకటేశ్వరమ్మ, నాచుగుంట, నాగాయలంక మండలం

ఆరోగ్య ధీమా



వైద్యసేవలు భేష్



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు అద్భుతంగా ఉన్నాయి. స్వల్ప అస్వస్థతకు గురైనా క్లినిక్‌లకు వెళ్లగానే వైద్యాధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి వైద్య సహాయం అందిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నాకు వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి క్లినిక్‌లోనే అందుబాటులో ఉన్న మందులను అందజేశారు. వెంటనే కొలుకున్నాను.

– జంపాన అంకప్రసాద్, చిన్నాపురం వాసి, బందరు మండలం

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లతో పల్లెకు చేరిన వైద్యం
- నెలలో రెండు సార్లు విలేజ్ క్లినిక్‌లకు వైద్యులు
- రోగుల ఇంటికి వెళ్లి వైద్యసేవలు
- తగ్గిన వ్యయ ప్రయాసలు



సంగమేశ్వరంలో మంచంపై ఉన్న రోగి ఇంటికి వెళ్లి పరీక్షిస్తున్న వైద్యుడు



గూడూరులో ఫ్యామిలీ కాన్సెప్ట్‌లో రోగులకు మందులిస్తున్న వైద్య సిబ్బంది

చిలకలపూడి/అవనిగడ్డ/ పెడన : ప్రతి పల్లెకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్)ను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబీకులకు ఆరోగ్య ధీమా లభిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ (పీడీపీ) ద్వారా ప్రతి నెలా రెండుసార్లు ప్రజల ఇళ్లకే వెళ్లి రోగులను గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రతి క్లినిక్‌లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను నియమించారు. వీరు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. ఇది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం. మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. గతంలో మండల కేంద్రాల్లోని వైద్యశాలలు, పీహెచ్‌సీలకు వెళ్లి వైద్యం చేయించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారమని, ఇప్పుడు ఇళ్ల వద్దకే వచ్చి వైద్య సేవలు అందించడంపై గ్రామీణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సేవలు ఇలా..

అవనిగడ్డ నియోజకవర్గంలో 62, మచిలీపట్నం నియోజకవర్గంలో 24, పెడన నియోజకవర్గంలో 56 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతునొప్పి, టీబీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం 6,256 మందిని పరీక్షించారు. ఏప్రిల్‌లో 1962, మేలో 2,046 మంది, జూన్ లో 2,248 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 60 ఏళ్లు పైబడిన వారు 3,834 మంది ఉండగా, 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు 1,467మంది, 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్న వారు 955 మంది ఉన్నారు. వీరిలో 76 శాతం బీపీ, షుగర్, గ్యాస్ ట్రబుల్, మోకాళ్ల నొప్పుల వారు ఉన్నారు.

వైద్య పరీక్షలు, మందులు ఉచితం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక గరిశపూడిలో కొత్తగా ఆస్పత్రి ఏర్పాటు చేశారు. అక్కడే ఉచితంగా షుగర్ పరీక్ష చేస్తున్నారు. గతంలో ఎంతో దూరం వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వచ్చేది. ఆర్‌ఎంపీలకు చూపించుకునే వాడిని. ఇప్పుడా పరిస్థితి లేదు. రూపాయి ఖర్చు లేకుండా అంతా ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన మందులు కూడా ఇస్తున్నారు. మా గ్రామంలోనే వైద్య పరీక్షలు చేయడం సంతోషంగా ఉంది.

– నడకుదుటి బాలకృష్ణ, చినచందాల, కృత్తివెన్ను మండలం

ఆస్పత్రికి తీసుకువెళ్లాలంటే నరకం చూసేదాన్ని



నా భర్త పోతురాజు మూడేళ్ల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లాలంటే నరకం చూసేదాన్ని. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో వైద్యులే ఇంటికి వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. దాంతో నాకు చాలా శ్రమ తగ్గింది. క్రమం తప్పకుండా వైద్యులు పరీక్షించి చికిత్సతో పాటు జాగ్రత్తలు చెబుతుండటంతో ఆయన క్రమంగా కోలుకుంటున్నాడు. నిరుపేదలకు బాసటగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– యనమల నరసమ్మ, గూడూరు

నాకు ఆరో నెల... ఇంటికి వచ్చి వైద్యం అందిస్తున్నారు



నాకు ఆరో నెల వచ్చింది. రెండు నెలల కిందట నాగేశ్వరరావుపేట డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్ నెస్ సెంటర్‌లో మొదటగా వెళ్లి చూపించి పేరు నమోదు చేసుకున్నా. చిరునామా కూడా తెలియజేయడంతో ఇంటికి వచ్చి పరీక్షలు చేస్తున్నారు. ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలు వచ్చి నా ఆరోగ్యం తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్‌కు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు కూడా లేడీ డాక్టర్ చేస్తున్నారు. రక్త పరీక్షలు కూడా చేశారు. ఈసీజీ తీశారు. బేబీ ఆరోగ్యం బాగానే ఉందన్నారు. చాలా సంతోషంగా ఉంది.

–బండారు హిరణ్యలక్ష్మీ నాగసాయి, జానకీరామపురం, బంటుమిల్లి మండలం

సంతోషంగా ఉంది



ఎదురుమొండి దీవిలో మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించడం ఎంతగానో సంతృప్తి నిస్తోంది. 14 రకాల టెస్ట్‌లు చేసి అవసరమైన రోగులకు ఇంజక్షన్‌లు చేస్తున్నాం. మందులు అందజేస్తున్నాం. వైద్యసేవల సమయంలో వారు చూపే ఆప్యాయత మరువలేనిది.

–కొడాలి మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ, నాచుగుంట హెల్త్‌క్లినిక్, నాగాయలంక మండలం

వైద్య సేవలు చేరువయ్యాయి



మా గ్రామంలో అనారోగ్యం పాలైన వారు చికిత్స కోసం 22 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మా ఊరిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నిర్మించారు. వైద్యులు ప్రతి రోజు అందుబాటులో ఉండి ఇంటింటికి వచ్చి వైద్యసేవలు అందిస్తూ మందులు పంపిణీ చేస్తున్నారు. సముద్రతీరంలో ఉన్న మా గ్రామానికి ఇన్నాళ్లకు వైద్యసేవలు చేరువయ్యాయి.

– కాలా రూపారావు, పెదపట్నం

సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు తప్పవు

రౌడీషీటర్లకు బందరు డీఎస్పీ మాధవరెడ్డి హెచ్చరిక



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మాధవరెడ్డి

కోనేరుసెంటర్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అల్లర్లు అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని బందరు డీఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. బందరు సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ తన కార్యాలయంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెడు నడత కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఏ ఒక్కరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తుండాలని చెప్పారు. ముఖ్యమైన పనుల మీద బయటి ప్రాంతాలకు వెళ్లాలంటే సంబంధిత స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇనకుదురుపేట, ఆర్ పేట, పెడన రూరల్ సీఐలు ఉమామహేశ్వరరావు, రవికుమార్, వీరయ్య గౌడ్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం





కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులు .. (ఇన్‌సెట్) కల్యాణమూర్తులు

కోడూరు: వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాల మధుర స్వరాలు.. పూల పరిమళాలు.. భక్తబృందాల కోలాట భజనల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోడూరుకు చెందిన పాంచజన్య గీతా భక్తబృందం, భాష్యకార భక్తసమాజం ఆధ్వర్యంలో మచిలీపట్నానికి చెందిన లక్ష్మీ శ్రీనివాస మ్యూజికల్ అకాడమీ పర్యవేక్షణలో స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో స్వామివార్ల కల్యాణోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివార్ల ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. కోడూరు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 50 మంది దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణంలోని ఘట్టాలను, స్వామివార్ల, అమ్మవార్ల గుణగణాలను పండితులు వివరించిన తీరు ఆకట్టుకుంది. తొలుత ఉత్సవమూర్తులను స్థానిక కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయం నుంచి ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చారు.

ఆకట్టుకున్న కోలాటం..

కల్యాణాన్ని పురస్కరించుకొని భక్తబృందాల మహిళలు చేసిన కోలాట భజనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామివారి సంకీర్తనలు, భజనలు, నృత్యాలు చేస్తూ భక్తిభావం చాటుకున్నారు. పలువురు చిన్నారులు గోదాదేవి వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. లక్ష్మీ శ్రీనివాస మ్యూజికల్స్‌కు చెందిన గాయకులు వెంకటేశ్వరస్వామి వారి గీతాలను ఆలపించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివార్ల చిత్రపటాలను అందించారు. ఆర్యవైశ్య ప్రముఖులు, భక్త సమాజాల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెంగాలీ కూలీలతో వరినాట్లు



కృత్తివెన్ను: ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సీజన్ కావడంతో వ్యవసాయ కూలీల కొరత ఎక్కువగానే ఉంది. దీంతో మండలంలోని యండపల్లి గ్రామానికి చెందిన రైతు పిన్నెంటి విశ్వేశ్వరరావు పశ్చిమబెంగాల్ నుండి వ్యవసాయ కూలీలను రప్పించారు. వారితో వరినాట్లు వేయిస్తున్నారు. దీనిపై రైతు మాట్లాడుతూ బెంగాలీకి చెందిన వ్యవసాయ కూలీల వల్ల నాట్లు వ్యయం చాలా వరకు తగ్గుతుందన్నారు. ఎకరానికి ఇక్కడి వారితో నాట్లు వేయిస్తే ఖర్చు రూ. 9 వేల వరకు అవుతుందని, అదే బెంగాలీ కూలీలు కేవలం రూ. 4,500లతో ఎకరం వరి నాట్లు పూర్తి చేస్తున్నారని చెప్పారు. బెంగాలీ వారు ఎకరానికి తక్కువ నారుతో నాట్లు పూర్తి చేయడంతో భవిష్యత్‌లో తెగుళ్లు, చీడపీడల బాధ కూడా తగ్గుతుందన్నారు. మొత్తానికి బెంగాలీ నాట్లు ప్రక్రియను స్థానిక రైతులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

బంటుమిల్లి: మండల పరిధిలోని కంచడం శివారు కొత్తూరు(నాగేశ్వరపురం) గ్రామానికి మంజూరైన నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. కంచడం ప్రధాన గ్రామం నుంచి కొత్తూరు గ్రామానికి సుమారు 1500 మీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో నామినేషన్ పద్ధతిపై చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచు బండారు చంద్రశేఖర్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. జేసీబీతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ భగవాన్, పీఏసీఎస్ చైర్మన్ గంధం శేషగిరి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దర్గాలు, పంజాల వద్ద వీధి దీపాల ఏర్పాటు

మచిలీపట్నంటౌన్: ఈ నెల 29వ తేదీన మొహర్రం దుఃఖదినాలను పురస్కరించుకుని నగరంలోని దర్గాలు, పంజాల వద్ద ప్రత్యేకంగా వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని చంపాచెరువు, దేశాయిపేట, చింతగుంటపాలెం, రాజుపేట తదితర ప్రాంతాల్లో షియా ముస్లింలు మొహర్రం దుఃఖదినాల్లో భాగంగా ప్రత్యేక చెస్ట్ బీటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దర్గాలు, పంజాలకు వెళ్లే ముస్లింలకు రాత్రి, తెల్లవారుజామున ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే పేర్ని నాని ఆదేశాలతో ప్రత్యేక వీధి దీపాలు, పారిశుద్ధ్యం పనులు, తాగునీటి సౌకర్యాలను నగర పాలక సంస్థ కల్పిస్తోంది. 33వ డివిజన్ ప్రాంతంలోని దర్గాలు, పంజాల వద్ద ఈ ఏర్పాట్లను ఆదివారం నిర్వహించారు. పనులను డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ పర్యవేక్షించారు.

పైడమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి ఆలయం వెనుక భాగంలో భోజనాల షెడ్డు నిర్మాణానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీవీ రామ్మోహనరావు మాట్లాడుతూ భోజనాల షెడ్డు నిర్మాణానికి పట్టణానికి చెందిన కలంకారి వ్యాపారవేత్త పిచ్చుక కోటేశ్వరరావు, హేమాక్షి దంపతులు మొత్తం ఖర్చు భరిస్తామని చెప్పారు. దీని నిమిత్తం ఆదివారం ప్రత్యేకంగా హోమాలు, పూజలు నిర్వహించామన్నారు. కౌన్సిలర్ పి. సతీష్ బాబు, పి. కోటేశ్వరరావు, యర్ర టార్జానరావు, ధర్మకర్తల మండలి సభ్యులు తోట నాగేశ్వరరావు, సాంబశివరావు, భగవాన్, రామారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారుల పుస్తక పఠనం

అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాస్ పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పలువురు చిన్నారులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారు తమకు నచ్చిన పుస్తకాలను తీసుకుని చదివారు.

ప్రతి సమస్యకు పరిష్కారం

పేర్ని కిట్టు



నెలకుర్రు గ్రామంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని నెలకుర్రు గ్రామంలో రెండో రోజైన ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కిట్టు ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులకు సూచించారు. కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాలకు మేలు చేసేలా పాలన చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోయేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి బాసిశెట్టి సురేంద్రబాబు, మాజీ ఎంపీటీసీ బొమ్మసాని వెంకటేశ్వరరావు, కర్రా గాంగేయుడు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



మచిలీపట్నంటౌన్: స్వాతంత్ర సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర తిలక్, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమం ఆదివారం స్థానిక గొడుగుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ కాంగ్రెస్‌లో అతివాదిగా ఉన్న బాలగంగాధర తిలక్ మహారాష్ట్రలో కీలకపాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్యం తన జన్మహక్కు అని, దీనిని సాధించేందుకు ముంబైలో ప్రత్యేక ఉద్యమాన్ని నిర్వహించారని చెప్పారు. దేశ వ్యాప్తంగా విప్లవ ఉద్యమాన్ని నడిపి బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించిన చంద్రశేఖర ఆజాద్ జీవితం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పీవీ ఫణికుమార్, సూరిశెట్టి హరికృష్ణ, బొందిలి సత్యనారాయణసింగ్, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ ఏర్పడింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ పర్యవేక్షించారు.

లైఫ్ జాకెట్లు ధరించాలి

పెదకళ్లేపల్లి(మోపిదేవి) : బోటు నిర్వాహకులు, ప్రయాణికులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ పద్మ అన్నారు. పెదకళ్లేపల్లిలో కృష్ణానదికి వస్తున్న వరద నీటి ప్రవాహాన్ని ఆదివారం పరిశీలించారు. పెదకళ్లేపల్లి నుంచి పిట్టల్లంక గ్రామాల మధ్య నదిలో బోటుపై రాకపోకలు సాగించే ప్రయాణికులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు.